క్షీరారామంలో కార్తీక పూజలకు ఏర్పాట్లు

- నేటి నుంచి కార్తీకమాసం పూజలు
- ఆలయంలో క్యూ లైన్లు, చలువ పందిళ్ల నిర్మాణం
- నూతనంగా స్వామివారికి మొదటి గో దర్శనం

పాలకొల్లు సెంట్రల్: పంచారామ క్షేత్రాల్లో ఒకటిగా ప్రసిద్ధిగాంచిన పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో నేటి నుంచి కార్తీకమాసం పూజలు ప్రారంభం కానున్నాయి. శనివారం నుంచి ప్రారంభం కానున్న కార్తీకమాస పూజలు నెల రోజులు పాటు కొనసాగనున్నాయి. ఈ పూజల నిమిత్తం ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. యాత్రికులు, భక్తుల సౌకర్యార్థం స్వామివారి దర్శనం కోసం ప్రతి రోజూ ఉదయం 4 నుంచి రాత్రి 9 గంటల వరకూ ఆలయాన్ని తెరిచి ఉంచుతారు. కార్తీక సోమవారం, ఆదివారం, కార్తీక పౌర్ణమి ఇలా ముఖ్యమైన పర్వదినాల్లో వేకువజామున 3 నుండి రాత్రి 11 గంటల వరకూ స్వామివారి దర్శనార్థం ఆలయాన్ని తెరిచి ఉంచనున్నారు. ఈ కార్తీకమాసంలో నవంబర్ 4, 11, 18, 25 తేదీల్లో నాలుగు కార్తీక సోమవారాలు, నవంబర్ 3, 10, 17, 24, డిసెంబర్ 1 తేదీల్లో నాలుగు ఆదివారాలు, నవంబర్ 13న శిల్క్ ద్వాదశి, 15న కార్తీక పౌర్ణమి ముఖ్య పర్వదినాలు. 29న మాసశివరాత్రి సందర్భంగా స్వామివారికి లీలా కల్యాణం నిర్వహిస్తారు. ఈ ముఖ్యమైన కార్తీకమాస పర్వదినాల్లో ఆలయం భక్తులతో కిటకిటలాడుతుంది. ఈ ప్రత్యేక పర్వదినాల్లో భక్తుల కోసం క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ప్రత్యేక దర్శనం టికెట్లు రూ.50, అభిషేకానికి రూ.100, అర్చనకు రూ.20, కుంకుమ పూజకు రూ.30 టికెట్ ధరలు నిర్ణయించారు. ఏకాదశి రుద్రాభిషేకం రూ.200, పాశుపతాభిషేకం రూ.300, నెలవారీ అభిషేకాలు చేయించుకునే భక్తులకు


విద్యుద్దీపాలంకరణలో ఆలయం (పెదగోపురం)


ఆలయం వెనుక భాగంలో చలువ పందిళ్ల ఏర్పాటు


ఆలయంలో స్టెయిన్‌లెస్ స్టీల్ క్యూలైన్ల ఏర్పాటు


గర్భాలయంతో వరుసగా ఉపాలయాల పంచ శిఖరాలు


ఆలయ ప్రాకారంలో దీపాలు వెలిగించకుండా క్లాత్ ఏర్పాటు

అభిషేకాల రుసుం రూ.750, లక్ష కుంకుమ పూజకు రూ.500, లక్షపత్రి పూజకు రూ.1500, లీలా కల్యాణం రూ.1,116, చండీహోమం రూ.1000, లక్ష్మీగణపతి హోమం కోసం రూ.750 టికెట్ ధరలు నిర్ణయించారు. పోలీస్ అవుట్‌పోస్ట్, ఆరోగ్య కేంద్రం అందుబాటులో ఉంచనున్నారు.

ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన పూజలు

ఈ కార్తీకమాసం నెల రోజులూ ముందుగా స్వామివారికి గోదర్శనం చేయించిన అనంతరం భక్తులకు దర్శనం ప్రారంభించనున్నారు. ఆలయ ప్రాంగణంలో స్వామివారి వద్ద కర్పూర జ్యోతి వెలిగించిన అనంతరం ఆకాశ దీపాలను వెలిగించనున్నారు. ప్రతి ఉపాలయం వద్ద ఆకాశ దీపాలను ఆలయం ధ్వజ స్తంభం వద్ద ఏర్పాటు చేశారు.

అభిషేకాలకు, సాలగ్రామ దానాలకు ప్రత్యేక ఏర్పాట్లు

ఆలయంలో స్వామివారికి మహన్యాస పూర్వక అభిషేకాలు చేయించుకునే భక్తుల కోసం గర్భాలయం వెనుక భాగంలో చలువ పందిర్లు, దక్షిణ భాగంలో ఉన్న నూతన (పాత దేవుని హాలు) అభిషేక మండపంలో మహన్యాస పూజల కోసం ఏర్పాట్లు చేశారు. మహన్యాసం అనంతరం గర్భాలయంలో క్షీరారామలింగేశ్వరస్వామికి అభిషేకం చేసుకునేలా వెసులుబాటు కల్పించారు. సాలగ్రామ, దీప, ఉసిరి, వస్త్ర, గో దానాలు చేసే భక్తుల సౌకర్యార్థం దానాలు తీసుకునే బ్రాహ్మణుల కోసం ఆలయం ఉత్తర భాగంలో గోశాల వద్ద ఏర్పాట్లు చేశారు.

ఆలయం వద్ద పార్కింగ్ సమస్య పరిష్కారం

ప్రస్తుతం ఆలయానికి ఉత్తర భాగంలోని ఖాళీ ప్రదేశాన్ని పార్కింగ్ స్థలంగా ఏర్పాటు చేశారు. పంచారామ యాత్రికులను తీసుకువచ్చే బస్‌లు, కార్లు శనివారం మార్కెట్ రోడ్డు, మార్కెటింగ్ యార్డులో పార్కింగ్ చేసుకోవచ్చు.

ప్రత్యేక ఏర్పాట్లు



దేవదాయ ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం కార్తీక మాసంలో ఆలయానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. వివిధ సంస్థల ద్వారా ప్రసాదం,పాలు అందజేస్తాం. ఉచిత దర్శనం, ప్రత్యేక దర్శనానికి క్యూలైన్లు ఏర్పాటు చేశాం. తాగునీరు, వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నాం .

– ముచ్చర్ల శ్రీనివాసరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి, పాలకొల్లు

ఆలయంలో భక్తులు సందర్శించాల్సిన దేవతామూర్తులు

పంచారామక్షేత్రం క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం పంచాయతన ఆలయంగా ప్రసిద్ధి చెందింది. ఆలయంలో అన్ని ఐదుతో ముడిపడి ఉంటాయి. ఆలయం గాలిగోపురం 120 అడుగుల ఎత్తులో 9 అంతస్తులతో ఉంటుంది. క్షీరారామ లింగేశ్వర స్వామిని దర్శించుకోవడానికి పంచ (ఐదు గుమ్మాలు) ద్వారాలను దాటుకుని వెళ్లాలి. ఆలయంలో పంచ శిఖరాలు, పంచ నందులు, పంచ గణపతులు, పంచ శివలింగాలు, పంచ అమ్మవార్లు, పంచ మండపాలు ఉన్నాయి. స్వామికి ఉత్తరం వైపున క్షేత్రపాలకుడు జనార్ధనస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దక్షిణ భాగంలో వినాయకుడు, గోకర్ణేశ్వరస్వామి వరుసగా కొలువై ఉన్నారు. ఈ ఐదు ఆలయాలు వరుసగా ఉండడంతో పంచ శిఖరాలు దర్శనం అని అంటారు. స్వామికి తూర్పు ఆగ్నేయ దిశగా సూర్య భగవానుడు, కాశీవిశ్వేశ్వరుడు, పార్వతి, లక్ష్మీదేవి, నగరేశ్వరస్వాములు కొలువై ఉన్నారు. దక్షిణంలో సప్తమాత్రుకులు, బ్రహ్మ, కనకదుర్గమ్మ, వీరభద్రులు, పడమర నైరుతి భాగంలో సరస్వతి దేవి, పంచముఖ లక్ష్మీగణపతి, నాగేంద్రుడు ఉన్నారు. స్వామికి వెనుకభాగం పడమరలో కార్తికేయుడు, వాయువ్యంలో మహిషాసురమర్ధిని అమ్మవారు కొలువై ఉన్నారు. ఉత్తర భాగంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, ఆలయం వెలుపల గోశాల వద్ద బీమేశ్వరస్వామి, ఈశాన్యంలో దక్షిణామూర్తి, కాలభైరవుడు, దత్తాత్రేయుడు, నాగేంద్రుడు, నటరాజస్వామి, శనీశ్వరుడు కొలువై ఉన్నారు. ఆలయ ప్రాంగణంలో ఉత్తర భాగంలో నక్షత్రం వనం ఉంది. ఆలయ ప్రాకారంలో స్వామి వారికి తూర్పు ఈశాన్యంలో ఆంజనేయస్వామి, ఆగ్నేయంలో వీరభద్రుడు కొలువై ఉన్నారు.

యాత్రికులను వేధిస్తున్న రెండు ప్రధాన సమస్యలు

చేపల మార్కెట్‌లోంచి వెళ్లాల్సిందేనా?

ఆలయానికి వచ్చే కార్తీకమాసం యాత్రికుల సౌకర్యార్థం బస్‌లు, కార్లకు శనివారం మార్కెట్ రోడ్డులో పార్కింగ్ ఇస్తున్నారు. అక్కడి నుంచి భక్తులు రావడానికి చేపల మార్కెట్‌లో నుంచి తప్ప మరో మార్గం లేదు. ఆలయానికి ఎటు నుంచి రావాలన్నా చుట్టూ తిరిగి రావలసి ఉంటుంది. అందువల్ల యాత్రికులు బస్ దిగిన వెంటనే రామగుండం పార్కు నుంచి ఎన్టీఆర్ కళాక్షేత్రం మీదుగా మార్గం ఇస్తే భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుంది. మరో ప్రత్యామ్నాయంగా బస్టాండ్ నుంచి బస్‌లను నేరుగా కళాక్షేత్రం వరకూ తరలించి భక్తులు వాహనాలను దిగిన తరువాత వాటిని పార్కింగ్ స్థలానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

రాత్రి బస.. పెద్ద సమస్య

ఆలయానికి వచ్చే భక్తులు కొందరు రాత్రికే పుణ్య క్షేత్రానికి చేరుకుంటారు. అటువంటి భక్తులు పట్టణ రోడ్లపైనే సేద తీరుతున్నారు. ఉదయాన్నే స్నానాలు చేయాలన్నా టాయిలెట్ల సమస్య ఎక్కువగా ఉంటోంది. స్వామివారి క్షేత్రం చుట్టూ క్షీరపురి అన్నదాన సమాజంతో పాటు పలు సత్రాలున్నాయి. క్షీరపురి పుణ్యక్షేత్రంలో రాత్రి బస చేసే యాత్రికులు ఈ సత్రాల్లో సేద తీరే విధంగా దేవదాయ ధర్మాదాయశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు భక్తులు సూచిస్తున్నారు.

క్లుప్తంగా

ముస్తాబవుతున్న శైవ క్షేత్రాలు


కార్తీక మాసానికి ముస్తాబైన పార్వతీ విశ్వేశ్వర స్వామి ఆలయం

మొగల్తూరు: కార్తీకమాసం శనివారం నుంచి ప్రారంభం కానుంది. దీంతో మండలంలోని ముత్యాలపల్లిలోని భువనేశ్వరీ సమేత ముక్తేశ్వర స్వామి ఆలయం, పేరుపాలెంలోని చంద్రమౌళీశ్వర స్వామి ఆలయం, కాళీపట్నంలోని కాళికేశ్వర స్వామి ఆలయం, మొగల్తూరులోని పురాతన పార్వతీ విశ్వేశ్వర స్వామి ఆలయం, వనమల్లికార్జున స్వామి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. శనివారం వేకువ జాము నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 4వ తేదీ మొదటి సోమవారం రోజున స్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించేందుకు వీలుగా క్యూలైన్లు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం


అంబేడ్కర్ సెంటర్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నరసాపురం: ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. సంఘ నాయకుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ సెంటర్, మృత్యుంజయనగర్‌లో జెండాను ఆవిష్కరించారు. సంఘ రాష్ట్ర నేత నెక్కింటి సుబ్బారావు మాట్లాడుతూ కార్మిక హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ అనేక పోరాటాలు చేసిందన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ఆరేటి మత్యుంజయ, సానబోయిన ఫనిరాజు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ బాలచందర్‌కు ఘన సత్కారం


డాక్టర్ బాలచందర్‌ను ఘనంగా సత్కరిస్తున్న పెనుగొండ ఎస్వీకేపీ కళాశాలల పాలకవర్గం

పెనుగొండ: తెలుగు సాహిత్యానికి విశేష సేవలందిస్తూ, పెనుగొండ ఎస్వీకేపీ అండ్ పీవీ జూనియర్ కళాశాల తెలుగు విభాగాధిపతిగా సేవలందించి పదవీ విరమణచేసిన డాక్టర్ బాలచందర్ సాదే దంపతులను ఎస్వీకేపీ విద్యా సంస్థల పాలకవర్గం ఘనంగా సత్కరించింది. కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ బాలచందర్ సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు తాడి నాగరెడ్డి, సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కే రామచంద్రరాజు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కేవీఆర్ సూర్యనారాయణ, విశ్రాంత ప్రిన్సిపాల్స్ డాక్టర్ గుబ్బల తమ్మయ్య, ఆదికేశవ స్వామి, డాక్టర్ రంకిరెడ్డి రామ్మోహనరావు, పూర్వ విద్యార్థులు డాక్టర్ ఉన్నమట్ల మునిబాబు, బండి ప్రసాద్, పలివెల శ్రీనివాస్, మాకా ప్రకాష్, మణికంఠ, జెంట్రీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన

పాలకొల్లు అర్బన్: కాపవరం, వాలమర్రు, అరట్లకట్టలో పల్లె పండుగలో భాగంగా రూ.1.80 కోట్ల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి నిమ్మల రామానాయుడు శంకుస్థాపన చేశారు. జెడ్పీటీసీ నడపన గోవిందరాజుల నాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, ఏఎంసీ మాజీ చైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకంపై శ్రద్ధ చూపాలి

పాలకొల్లు సెంట్రల్: మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యార్థులందరూ తినేలా ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి నారాయణ సూచించారు. శుక్రవారం మండల వనరుల కేంద్రాన్ని (ఎంఆర్‌సీ) ఆయన సందర్శించారు. అనంతరం ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఈవో నారాయణ మాటాడుతూ విద్యార్థుల అపార్ కార్డుల ప్రక్రియలో ఏమైనా ఇబ్బందులుంటే పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారిని సంప్రదించాలన్నారు. నవంబర్ 14న పేరెంట్స్ సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. పేరెంట్స్ సమావేశంలో వారికి అపార్‌కార్డుపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎఫ్‌ఏ వన్ మార్కులు ఆన్‌లైన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు గుమ్మళ్ల వీరాస్వామి, జి శర్మ, సీనియర్ అసిస్టెంట్ కుమార్‌స్వామి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో నారాయణ

పింఛన్ల పంపిణీలో మొరాయించిన సర్వర్లు

మొగల్తూరు: నవంబర్ నెల పింఛన్ల పంపిణీకి సర్వర్ పనిచేయకపోవడంతో ఎక్కడికక్కడ ఇబ్బందులు ఎదురయ్యాయి. శనివారం ఉదయం 7 గంటలు వరుకు పింఛన్ల పంపిణీ సక్రమంగానే సాగింది. ఎంపీడీవో సీహెచ్ త్రిశూల పాణి, ఈవోపీఆర్డీ నవీన్ కిరణ్ మొగల్తూరు పంచాయతీ పడమటిపాలెంలో పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు. సర్వర్‌లో సమస్య తలెత్తడంతో పింఛన్ల పంపిణీ అర్ధాంతరంగా నిలిచిపోయింది. మండలంలోని 17 గ్రామాలకు సంబంధించి సుమారు 10,609 మందికి పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేశారు. పింఛన్ పంపిణీ నిలిచిపోవడంతో లబ్ధిదారులు నిరాశ చెందారు. గ్రామంలోని సచివాలయాలు లేదా పంచాయతీ కార్యాలయాలకు వెళ్లినా ఇదే పరిస్థితి ఏర్పడటంతో నిరాశగా వెనుతిరిగారు. దాదాపు ఏడుగంటలు అనంతరం మధ్యాహ్నం 12 గంటలు దాటిన తరువాత సర్వర్ పనిచేస్తుండటంతో సుమారు 9వేల మందికి పింఛన్లు అందించామని ఎంపీడీవో తెలిపారు.


శేరేపాలెంలో సర్వర్ పనిచేయకపోవడంతో నిరాశగా ఎదురు చూస్తున్న వృద్ధురాలు

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులు

పెనుగొండ: రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పెనుగొండ పొట్టి శ్రీరాములుకు ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం పెనుగొండ పంచాయతీ వద్ద, గాంధీ బొమ్మల సెంటర్ వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. పంచాయతీ వద్ద సర్పంచ్ నక్కా శ్యామలా సోనీ శాస్త్రి, గ్రామ కార్యదర్శి టి రత్నాకరరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. గాంధీ బొమ్మల సెంటర్‌లో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పలువురు పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించారు.


పెనుగొండ పంచాయతీలో నివాళులర్పిస్తున్న సర్పంచ్ శ్యామలాసోని, పంచాయతీ సిబ్బంది

దాడులను అరికట్టాలి

తణుకు టౌన్ : రజక వృత్తి చేసుకునే మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను నివారించాలని, రజకులకు రక్షణ చట్టం తక్షణమే అమలులోకి తీసుకురావాలి ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి మడకం రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం తణుకు రూరల్ మండలం వేల్పూరులో నిర్వహించిన రజక వృత్తిదారుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈకార్యక్రమానికి మీసాల రాము అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా రాజు మాట్లాడుతూ 50 ఏళ్ల నిండిన రజక వృత్తిదారునికి వృద్ధాప్య పింఛన్ ఇవ్వాలన్నారు. సబ్సిడీపై బొగ్గు సరఫరా చేయాలని, రూ. 2 లక్షలను సబ్సిడీతో కూడిన రుణాలుగా అందజేయాలని కోరారు.

క్షీరారామంలో ఆకాశ దీపోత్సవం


ఆకాశ దీపాలు వెలిగిస్తున్న మహిళలు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం పురస్కరించుకుని శుక్రవారం రాత్రి 6.30 గంటల సమయంలో ఆకాశ దీపం వెలిగించారు. ఆలయ అర్చకులు కిష్టప్ప, అనిల్, వీరబాబు, సోమేశ్వరరావు ఆధ్వర్యంలో స్వామివారి వద్ద కర్పూర దీపం వెలిగించి ఆలయ ప్రదక్షిణ అనంతరం ఆలయ ప్రాకారంలో ఏర్పాటు చేసిన ఆకాశ దీపాలను వెలిగించారు. మద్దూరి సూరిబాబు బ్రహ్మత్వంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాస్, సూపరింటెండెంట్ వాసు పాల్గొన్నారు.

కార్తీక పుణ్యస్నానాలకు ఏర్పాట్లు

పెనుగొండ: కార్తీక మాసం ప్రారంభం కావడంతో శనివారం నుంచి పుణ్యస్నానాలు చేసే భక్తులకు పెనుగొండ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. నరసాపురం కాలువ పొడవునా పెనుగొండ పంచాయతీ ఏరియాలో ఉన్న కాలువ రేవుల వద్ద స్నానాలు ఆచరించిన మహిళలు దుస్తులు మార్చుకోవడానికి తాత్కాలిక ఏర్పాట్లు శుక్రవారం పూర్తి చేశారు. దీంతో ఆయా రేవుల వద్ద ఇబ్బందులు లేకుండా విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి


ఆచంట జూనియర్ కళాశాలలో కరపత్రాలు విడుదల చేస్తున్న డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శర్మ

పెనుగొండ: మాదక ద్రవ్యాలు రహిత సమాజాన్ని నిర్మించే లక్ష్యంగా యువత కృషి చేయాలని భారత ప్రజాతంత్ర యువ జన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఎస్‌పీఎస్ శర్మ పిలుపు నిచ్చారు. డీవైఎఫ్ఐ 45వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆచంట ఎంవీఆర్ జూనియర్ కళాశాలలో డీవైఎఫ్ఐ పతాకాన్ని ఆవిష్కరించి కరపత్రాలు విడుదల చేశారు. డ్రగ్స్ నిర్మూలిద్దాం, యువతను కాపాడుకుందాం అంశంపై విద్యార్థులతో సెమినార్ నిర్వహించారు. దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందని, యువత డ్రగ్స్ బారిన పడి అనారోగ్యానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఐఎఫ్ఐ నాయకులు తమరాపు దుర్గాప్రసాద్, ఉన్నమట్ల ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోండి

పెనుగొండ: తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఈ నెల 6వ తేదీలోగా ఓటు నమోదు చేసుకోవాలని పెనుగొండ తహసీల్దారు, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి జి అనితకుమారి తెలిపారు. గడువు ముగిసే సమయానికి ముందుగానే పట్టభద్రులు సంబంధిత తహసీల్దారు, ఎంపీడీవో, మండల విద్యా శాఖాధికారి కార్యాలయాల్లో, నేరుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అనంతరం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తారని తెలిపారు. పరిశీలనకు అధికారులు వచ్చినపుడు ఆన్‌లైన్ దరఖాస్తులో సంతకం చేయడంతో పాటు డిగ్రీ ధ్రువపత్రం, ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు నకళ్లు, కలర్ ఫొటోలతో పాటు, గెజిటెడ్ అధికారి ఇంకు సైడు సంతకంతో అందజేయాలని సూచించారు. ప్రతి దరఖాస్తుపై విచారణ చేసి అర్హత ఉన్నవారి పేర్లు ఓటర్ జాబితాలో పొందుపర్చనున్నట్టు తెలిపారు.

ఆగర్రులో రక్తదాన శిబిరం

పాలకొల్లు అర్బన్: ఆగర్రు లూథరన్ చర్చిలో మతోద్ధరణ పండుగ సందర్భంగా శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని చందపర్రు పారిస్ పాస్టర్ రెవ.నక్కా కమలాకర్ ప్రారంభించారు. లూథరన్ చర్చి సంఘ యువజనులు సుమారు 30 మంది రక్తదానం చేశారు. సంఘ కార్యదర్శి దాసరి డేవిడ్, సీఆర్ సీహెచ్ శ్రీనివాసరావు, డెలిగేట్, చందపర్రు మాజీ సర్పంచ్ రాపాక విజయరత్నం, డాక్టర్ విల్లూరి రత్నంరాజు, ఫిజియోథెరపిస్ట్ డా.ఆమోస్, రెడ్‌క్రాస్ సొసైటీ, నరసాపురం కోఆర్డినేటర్ ఎనుముల సతీష్, సభ్యులు వికాస్, మహేష్, సురేష్, సంఘ పెద్దలు, సంఘ ఎల్‌సీసీలు, పీసీసీలు, సండే స్కూల్, యువజనులు, స్త్రీల సమాజం సభ్యులు పాల్గొన్నారు.


ఆగర్రు క్రీస్తు లూథరన్ చర్చిలో రక్తదానం చేస్తున్న యువజనులు





BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM

O.A. 266 \ 2024

Between :
Union Bank of India, (Erstwhile Andhra Bank) Represented by its Senior Branch Manager, Katarinagar Branch, Rajahmundry, E.G.District ...Applicant
And
1. Mr.Mattaparthi Durga Siva Prakash
2. Mr.Thunga Nageswara Rao
To,
1. Mr.Mattaparthi Durga Siva Prakash, (PAN No.BAUPM8350 A), S/o. Veera Bhaskara Rao, Residing at Door No.12-40, Panchayat Street, Machavaram, Ambajipeta, East Godavari District, Andhra Pradesh-533124. (D1)
2. Mr.Thunga Nageswara Rao, S/o. Trimurthulu, Residing at Door No.5-2-72, Kadimpuntha Gumparu, Yelamanchili Mandal, West Godavari-534266. (D2)

PAPER PUBLICATION SUMMONS

WHEREAS the application has instituted an application under section 19 of the Recovery of debts due to banks and Financial institutions Act, 1993 [Copy enclosed] against you for recovery of sum mentioned therein together with current and future interest and other relief's. You are hereby summoned to appear and file written statement before this Honourable Tribunal at 10.30 A.M. or at such time immediately thereafter according to the convenience of the Tribunal on 22.11.2024 to answer the claim.

You are directed to collect the OA BOOK or you appearance before the Tribunal.

If you intend to file any documents, you may file the same with a list along with the written statement.

You should file your registered address and a memo of Appearance when you enter for appearance before the Tribunal either in person or by pleader / Advocate duly instructed.

Take notice that, in case of default, your appearance on the day mentioned herein before, the proceedings will be heard and determined in your absence.

Given under my hand and the seal of the Tribunal, on this the 28th October, 2024 at Visakhapatnam

Signature of the Officer
Authorised to issue summons
DEBTS RECOVERY TRIBUNAL, VISAKHAPATNAM